విలువైన భవనం..
వినియోగంలోకి తెస్తే ఉపయోగం!

- నిరుపయోగంగా వైఎస్సార్ కల్యాణ మండపం
- వినియోగంలోనికి తీసుకురాని అధికారులు

ఇచ్ఛాపురం:

ప్రస్తుత రోజుల్లో ప్రతిఒక్కరూ ఎలాంటి కార్యాన్నైనా స్థోమతకు మించి హడావుడిగా చేయాలని భావిస్తున్నారు. దీన్నే అదునుగా చేసుకొని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ఫంక్షన్ హాల్‌ల్లో కార్యక్రమం నిర్వహించాలంటే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం కలిగిస్తూ ప్రతి ఒక్కరికీ ఫంక్షన్ హాల్ అందుబాటులో ఉండేలా ఇచ్ఛాపురం మున్సిపల్ అధికారులు ఓ కల్యాణ మండపాన్ని నిర్మించాలని భావించారు. పట్టణంలోని 15వవార్డు సంతపేట వద్ద 2007లో రూ. 37.75 లక్షలతో కల్యాణ మండపం పనులను ప్రారంభించారు. అయితే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన పాలకవర్గం ప్రహరీతోపాటు పూర్తి హంగులతో కూడిన కల్యాణ మండపం నిర్మాణానికి 2018-19లో ఆర్థిక సంవత్సరంలో రూ. 72.30 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రూ. 50 లక్షలు ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేసి వైఎస్సార్ కల్యాణ మండపంగా నామకరణ చేశారు. 2019లో అప్పటి జిల్లా మంత్రి ధర్మాన కృష్ణదాస్ దీన్ని ప్రారంభించారు. ఇంతవరకూ బాగానే ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచాలనే విషయాన్ని పూర్తిగా మరిచిపోయారు. కనీసం నిర్వహణను సైతం పట్టించుకోవడం మానేయడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఏ లక్ష్యంతో కల్యాణ మండపాన్ని నిర్మించారో ఆ లక్ష్యం నెరవేరకుండా పోయింది. లక్షలాది రూపాయల ప్రభుత్వం నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలాయి. విలువైన భవనం నిరుపయోగంగా ఉండడంతో మున్సిపాలిటీకి రూపాయి ఆదాయం కూడా లేదు. నిర్వహణ కూడా లేకపోవడంతో కల్యాణ మండపం భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి రూపం కోల్పోయింది. నీటి సదుపాయం కోసం ఏర్పాటు చేసిన మోటార్ సైతం చోరీకి గురైంది. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వైఎస్సార్ కల్యాణ మండపాన్ని అందుబాటులోనికి తీసుకువస్తే మధ్య తరగతి వారికి ఫంక్షన్ హాల్ అందుబాటులో ఉంటుందని స్థానికులు ఆశిస్తున్నారు.


నిరుపయోగంగా మారిన వైఎస్సార్ కల్యాణ మండపం

అందుబాటులోకి తీసుకురావాలి


మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వైఎస్సార్ కల్యాణ మండపం నిరుపయోగంగా తయారైంది. భవనం చుట్టూ పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించాలి. నీటిసౌకర్యం కల్పించడంతోపాటు చిన్నపాటి మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలి.

–బి.జగన్నాథం, ఇచ్ఛాపురం

వినియోగంలోనికి తీసుకొస్తాం


కల్యాణ మండపానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. దీని నిర్వాహణ బాధ్యతలు మున్సిపాలిటీ కాకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఎలా ఉంటుదనే విషయంపై కూడా అధికారులతో చర్చిస్తున్నాం. ఈ విషయంపై కౌన్సిలర్ల అభిప్రాయం తీసుకోవాల్సి ఉంది.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

క్లుప్తంగా

టెక్కలిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు రేపు


టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం టెక్కలిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించిన తరువాత ఉదయం తొమ్మిది గంటలకు టెక్కలి వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని కోరారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా చిన్నతుంగాం పంచాయతీ కార్యదర్శి దుంప శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసిన యు.సత్యన్నారాయణను గార మండలానికి డిప్యూటేషన్‌పై నియమించారు.

జిల్లాస్థాయి క్విజ్ విజేత హరిపురం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పేటూరు (సవరదేవిపేట)లో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మందస మండలం హరిపురం గీతం హైస్కూల్ విజేతగా నిలిచింది. వినాయక చవితి 55వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం క్విజ్ పోటీలను నిర్వహించగా.. ద్వితీయ, తృతీయ స్థానాలను హరిపురం, ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలకు చెందిన జట్లు కైవసం చేసుకున్నాయి. ఎంఈవో కురమాన అప్పారావు, లొద్దపుట్టి, శాసనాం హెచ్‌ఎంలు జాడు ప్రకాశరావు, కె.సత్యమయ్యలు విజేతలకు వరుసగా రూ.6,666, రూ.5,555,రూ.4,444ల నగదుతో పాటు షీల్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

దుర్గా శరన్నవరాత్రి మండపం ఏర్పాటుకు భూమిపూజ


భూమి పూజలో శిష్టు గోపి తదితరులు


పలాస: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల మండపం ఏర్పాటు పనులకు పలాస- కాశీబుగ్గ పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిష్టు గోపి ఆదివారం భూమి పూజ చేశారు. 19వ వార్డు పరిధిలోని కొత్తమ్మతల్లి ఆలయం వద్ద మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో జోగ తిరుపతిరావు, కోనారి ఆది, జోగి పవన్, ఎర్రాన్నాయుడు, బోనెల శ్రీకాంత్, హేమంత్, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై దృష్టిసారించండి


మాటాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు మున్సిపల్ విద్యుత్ వాడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రామరావు ఆదేశించారు. పురపాలక సంఘంలో విద్యుత్ విభాగానికి సంబంధించిన అధికారులు, సిబ్బందితో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండపాలకు ఉచిత విద్యుత్ అందిచడం వల్ల పురపాలక సంఘాల వీధి దీపాల నుంచి కాకుండా మెయిన్ లైన్ ద్వారా విద్యుత్ వాడకం వల్ల మున్సిపాలిటీకి భారం పడుతుందన్నారు. వీధి లైన్ల నుంచి చవితి మండపాలకు విద్యుత్ సరఫరా జరిగితే బిల్లులు చాలా ఎక్కువగా వస్తాయన్నారు. కాబట్టి అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుల శ్రమదానం


పూడికలను తొలగిస్తున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కంద్రవీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయి. దీంతో మురుగునీరు సక్రమంగా పారడం లేదు. దీంతో స్థానిక యువకులు ఆదివారం శ్రమదానం ద్వారా పూడికలను తొలగించి సమస్యను పరిష్కరించారు. నేషనల్ యూత్ వలంటీర్ హంగీర్ బెహరా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

చిరు వ్యాపారుల ఆందోళన!

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలోని చిరు వ్యాపారుల్లో తీవ్ర ఆందోళన నెలకుంది. పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా మహాత్మా గాంధీ పేరుతో ఉన్న కూరగాయల కాంప్లెక్స్ తొలగింపు అంశంపై ఇటీవల అధికారులు రూపకల్పన చేసిన అజెండాలో పొందుపరిచిన 567 అంశమే ఆందోళనకు కారణమైంది. పంచాయతీ పరిధి పాతబస్‌స్టాండ్‌లో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలతో పాటు అరటిపళ్ల అమ్మకాలు చేసుకునే వారి కోసం గతంలో దీన్ని నిర్మించారు. అయితే ప్రస్తుతం ఈ కాంప్లెక్స్ వలన ఎటువంటి ఆదాయం లేదని, అలాగే శిథిలావస్థకు చేరుకుందనే కారణంతో కూల్చివేయడానికి అజెండాలో పంచాయతీ సభ్యుల ఆమోదం కోసం విషయాన్ని పొందుపరిచారు. ఈ విషయం బయటకు తెలియడంతో ఇదే ఆసరాగా ఉన్నటువంటి చిరు వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని చెప్పినప్పటికీ అది ఇప్పట్లో కార్యరూపం దాల్చే పరిస్థితి లేదు. అలాగే వైఎస్సార్ జంక్షన్ నుంచి పాతబస్‌స్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారస్తులను అధికారులు ఖాళీ చేయించడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కూరగాయల కాంప్లెక్స్ తొలగింపు మరింత ఆందోళన కలిగిస్తోంది.


మహాత్మాగాంధీ కూరగాయల కాంప్లెక్స్

వైభవంగా రాధాష్టమి వేడుకలు


రాధాకృష్ణుల విగ్రహాలకు ఊంజల్ సేవ చేస్తున్న భక్తులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని రాధాకృష్ణ ఆలయంలో హరేరామ హరేకృష్ణ బృందం వారు రాధాష్టమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాధాకృష్ణుల విగ్రహాలకు ఊంజల్ సేవ చేశారు. భజనా కాలక్షేపం, కోలాటం నృత్య ప్రదర్శనలు చేపట్టారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఆర్థిక సాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన సూరి శ్యామ సుందర్ ఇటీవల మృతి చెందారు. భర్త మృతి చెందడంతో భార్య, పిల్లలు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు స్పందించారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుని భార్యకు ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

రైతు సమస్యలపై మరిన్ని పోరాటాలు

టెక్కలి: రైతు సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సుగు రామిరెడ్డి చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌ను రామిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రామిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం నుంచి తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం మరింత బాధ్యత పెంచిందన్నారు. గతంలో అచ్చెన్నాయుడుకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశానని గుర్తు చేశారు. టెక్కలి నియోజకవర్గంలో ఇన్‌చార్జి తిలక్ నేతృత్వంలో రైతు సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తానని వెల్లడించారు. ఈయనతో పాటు సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బి.మోహన్‌రెడ్డి, మూలపేట సర్పంచ్ జీరు బాబురావు, నాయకులు మంగి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.


తిలక్‌ను కలిసిన రామిరెడ్డి తదితరులు

భయపెడుతున్న శిథిల భవనాలు!


- పొంచిఉన్న ప్రమాదం
- తొలగించాలని ప్రజల విజ్ఞప్తి

సోంపేట: సోంపేట తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని శిథిల భవనాలు జనాన్ని భయపెడుతున్నాయి. ఎప్పుడు కూలి పోతాయో తెలియని పరిస్థితిలో దర్శనమిస్తున్నాయి. మూడు సంవత్సరాల క్రితం వరకు వినియోగంలో ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభించారు. దీంతో పాత భవనాలను ప్రస్తుతం వినియోగించకుండా వదిలేశారు. మూడేళ్లుగా ఖాళీగా ఉంచేయడంతో విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. పెచ్చులు ఊడి పడుతుండడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉంది. శిథిల భవనాలకు సమీపంలోనే ఉపఖజానా కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉపఖజానా కార్యాలయంలోకి పలుమార్లు విషసర్పాలు వెళ్లాయి. దీంతో అధికారులు స్నేక్ క్యాచర్ల సహాయంతో వాటిని బంధించి బయటకు వదులుతున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే అధికారులు భయపడే పరిస్థితి ఏర్పడింది.

ప్రమాదం జరిగితే ఇబ్బందులు తప్పవు

శిథిల భవనాల సమీపంలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో సోంపేట మండలంతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మందస మండలానికి చెందిన ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కొంతమంది శిథిల భవనాల కింద సేదతీరుతుంటారు. దరఖాస్తులు నింపడం చేస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి భవనాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న పాత ఉపతహసీల్దార్ కార్యాలయం


శిథిల భవనాల కింద సేదతీరుతున్న ప్రజలు


కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత తహసీల్దార్ భవనం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం


శిథిల భవనాల సమస్య తమ దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు రాగానే శిథిల భవనాలను తొలగిస్తాం.

–బి.అప్పలస్వామి, తహసీల్దార్, సోంపేట

వామ్మో..శునకాల గుంపు..!


టెక్కలి మేజర్ పంచాయతీలో శునకాల బెడద అధికమైంది. ప్రధాన కూడళ్లు, వీధుల్లో విచ్చలవిడిగా..గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నడిచి, వాహనాలపై వెళ్లేవారి వెంటబడుతూ భయపెడుతున్నాయి. పంచాయతీ యంత్రాంగం దృష్టిసారించి విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. –టెక్కలి

భారీవర్షం..


కవిటి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. పొలాల్లో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూశాఖ అందించిన సమాచారం ప్రకారం 3.3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. –కవిటి

డీఎస్సీ ర్యాంకర్‌కు అభినందన


డీఎస్సీ ఫలితాల్లో పీజీటీ (సోషల్) విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన టెక్కలి మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన కురమాన నిరోషాను మాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆదివారం అభినందించారు. అభినందన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, ప్రతినిధులు కె.రవికుమార్ గాంధీ, ఆర్.రామారావు, జె.బాబూరావు, వై.గడ్డెయ్య, ఎ.రాహుల్‌కుమార్, జె.లిమ్మారావు, జి.రమేష్, పి.జగదీష్, ఎం.దుర్యోధన, ఎం.వర్ధన్‌రావు, ఎ.రామయ్య ఉన్నారు. –టెక్కలి

గణనాథా దయచూపు..


కవిటి: జగతి శమళ్లవీధిలో సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు


కంచిలి: చిన్నశ్రీరాంపురంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గణేష నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన ఆదివారం లంబోదరుడికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చలు జరిగాయి. స్వామికి నైవేద్యాలు సమర్పించి తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. పలు గ్రామాల్లో అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. గణనాథుని లడ్డూ ప్రసాదాలను వేలం వేయగా భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు: ఉద్దానం మెళియాపుట్టిలో రూ. 20 వేలకు దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో బొమ్మాళి కుచేలు దంపతులు


పలాస: సూదికొండలో అన్నప్రసాదం వితరణ


ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం కొప్పల వీధిలో వేలంలో 50,100 రూపాయలకు దక్కించుకున్న లడ్డూతో మాధవరావు దంపతులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: జె.శాసనాం గ్రామానికి చెందిన మర్ల గోపాల్, బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామానికి చెందిన బుడ్డెపు తమ్మయ్య ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు లడ్డు కేశవపాత్రో, తలగాన తిరుపతిరావు, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, గోకర్ణపురం ఉపసర్పంచ్ కాళ్ల వైకుంఠరావు, మర్ల జేజే రావు, గొరకల హేమసుందర్, మర్ల వైకుంఠరావు, రంగాల దీనబంధు ఉన్నారు.


జెన్నాగాయిలో తమ్మయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంకర అక్రమ తరలింపు!

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న కొండ వద్ద అక్రమంగా కంకర (గ్రావెల్) తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కంకర తవ్వకాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిన్నప్పటికీ వాస్తవ రూపంలో ఆపరిస్థితి లేదు. మున్సిపాలిటీ పరిధిలో సహజ వనరులపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో యథేచ్ఛగా గ్రావెల్, ఎర్రమట్టి, ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా తరలించి కావాల్సిన వారికి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. కంకరని తరలిస్తున్న ట్రాక్టర్ల కారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొండపోలమ్మ కాలనీలో రోడ్లు పాడవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పీర్లకొండ వద్ద నుంచి ట్రాక్టర్‌లో కంకరను తరలిస్తున్న దృశ్యం

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

వజ్రపుకొత్తూరు రూరల్: రాజాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పిట్ట రామారావు (59) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. రామారావు భౌతికకాయనికి పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శి సంతాపం తెలియజేశారు. రామారావు మృతి పార్టీకి తీరని నష్టమన్నారు. కాగా మృతిని భార్య సుగుణ ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యురాలుగా సేవలు అందిస్తున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పిట్ట గీతారాణి, తిర్రి రాజారావు, నర్తు ప్రేమ్‌కుమార్, ఇరోతు హేమంత్ ఉన్నారు.


రామారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు